దోమలను తరిమేద్దాం

● ప్రారంభమైన మలేరియా మాసోత్సవాలు
● గ్రామాల్లో దోమల నియంత్రణకు ప్రత్యేక సదస్సులు



చొప్పెల్లలో మలేరియా నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న జిల్లా యూనిట్ శాఖ



ఆలమూరులో దోమల నియంత్రణకు డ్రైడే నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: వర్షాకాలం ప్రారంభం కావడంతో అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. అలాగే గ్రామాల్లో తరచూ నెలకొంటున్న అపారిశుధ్యం వల్ల దోమలు వృద్ధి చెంది ప్రజారోగ్యాన్ని తీవ్రంగా నష్టపరుస్తుంది. డబ్ల్యూహెచ్ఓ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా చేపడుతున్న దోమల నియంత్రణ సాధ్యం కాకపోవడంతో వైరల్ జ్వరాల తీవ్రత ఇబ్బందికరంగా మారింది. వాతావరణంలో సంభవించే మార్పుల వల్ల తేమశాతం అధికంగా ఉన్న ప్రదేశాల్లో ఈ దోమల వ్యాప్తి అధికంగా ఉంటుంది. దీంతో రాష్ట్రంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్వహించిన విధంగా ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నుంచి మలేరియా నిర్మూలన వారోత్సవాలను నిర్వహిస్తుంది. ఇప్పటికే క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని 23 పీహెచ్‌సీల పరిధిలో జిల్లా మలేరియా యూనిట్ శాఖ ఇప్పటికే వైద్య ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించింది. మలేరియా నిర్మూలనే లక్ష్యంగా ఈ మాసోత్సవాలను నిర్వహిస్తుంది.

మలేరియా చికిత్స

◆ మలేరియా సోకిన రోగి 14 రోజుల పాటు ఏకధాటిగా వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకోవాలి.

◆ మధ్యంలో మానేస్తే వ్యాధి తిరగబెట్టే అవకాశం ఉందని రోగులు గుర్తించాలి.

◆ ఫాల్సీపారం మలేరియా అయితే కేవలం మూడు రోజుల పాటు ఏసీటీ చికిత్సను తీసుకోవాలి.

◆ మలేరియా చికిత్స అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుంది.

◆ మలేరియా కారక క్రిమి అయిన అనాఫిలిస్ దోమ వర్షాకాలంలో ఎక్కువగా ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

నివారణ

◆ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలి.

◆ ఇంటి పరిసర ప్రాంతాల్లో కాని పెరట్లో కాని నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

◆ నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను తరచూ లార్వాసైడ్ క్రిమి సంహారక మందును పిచికారి చేయాలి.

◆ ఇంట్లోని గోడలపై సింథటిక్ పైరిత్రాయిడ్, ఏసీఎం క్రిమి సంహారక మందును అవసరమైన మేరకు పిచికారీ చేయాలి

◆ దోమ తెరలను ఏర్పాటు చేయడంతో పాటు దోమ చక్రాలు, ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న లిక్విడ్‌ల సాయంతో కూడా దోమల ఉధృతిని నివారించవచ్చు.

◆ మలేరియా సోకిన వ్యక్తి సత్వరమే కోలుకునేందుకు పండ్ల రసాలు, గ్లూకోజ్, చెరకు రసం వంటి ద్రవ పదార్థాలను విరివిగా తీసుకోవాలి.

నియంత్రణకు ప్రత్యేక చర్యలు

ఆడ అనాఫిలిస్ దోమకాటు వల్ల సంభవించే మలేరియా వ్యాధి నియంత్రణకు జూన్ ఒకటి నుంచి 30 వరకూ వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక అవగాహన కల్పిస్తారు. గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య చర్యలు పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టి మలేరియా వ్యాధి నివారణకు కృషి చేయవచ్చనే విధానాన్ని ప్రజలకు వివరించేందుకు సమాయత్తమవుతున్నారు. అలాగే గ్రామ పంచాయతీ పర్యవేక్షణలో సంపూర్ణ పారిశుధ్యం కల్పించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రణాళికలను రూపొందించింది. అలాగే ప్రతివారం నిర్వహించే డ్రైడే తోపాటు గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో దోమల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై అవగాహన సదస్సులను ఏర్పాటు చేయనున్నారు.

క్లుప్తంగా

బాలాజీని దర్శించుకున్న ఎస్పీ



ఎస్పీ కృష్ణారావుకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారిని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదివారం దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన ఎస్పీకి ఆలయ ముఖ్య అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన అనంతరం శ్రీ, భూ సమేతంగా కొలువైన బాలబాలాజీని ఎస్పీ దర్శించుకున్నారు. ఎస్పీ పేరిట అర్చకులు పూజలు జరిపించారు. అర్చకుల నుంచి ఎస్పీ వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ పర్యవేక్షకుడు సత్యమూర్తి స్వామి వారి చిత్రపటం, పట్టు వస్త్రాలు, శేష వస్త్రం, ప్రసాదాలను ఎస్పీకి అందజేశారు. ఆయన వెంట నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: పాశర్లపూడిబాడవలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. 216వ నంబర్ జాతీయ రహదారి నుంచి చింతలమెరక మీదుగా పాశర్లపూడిలంక వరకు రూ.2.15 కోట్ల వ్యయంతో మెటల్ రోడ్డును ఇటీవల పక్కా సీసీ రోడ్డుగా ఆధునీకరించారు. ఈ రోడ్డును ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. నగరం మొల్లేటివారిమెరకలో రేషన్ డిపో ద్వారా సరుకులు పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కుసుమ వనజకుమారి, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, సర్పంచ్‌లు కొనుకు ప్రేమజ్యోతి, జాలెం రమణకుమారి, కూటమి నేతలు పాల్గొన్నారు.

రేషన్ సరకుల పంపిణీ



మగటపల్లి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్

మామిడికుదురు: మగటపల్లి రేషన్ షాపులో నిత్యావసర సరకుల పంపిణీని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. రేషన్ సరకుల పంపిణీలో ఏర్పడుతున్న సాంకేతిక పరమైన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుందని చెప్పారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురి కావాల్సిన పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ట్రస్ట్ సేవలు అభినందనీయం



కొత్తపేటలో ఎమ్మెల్సీ వీర్రాజును సత్కరిస్తున్న చిట్టిబాబు

కొత్తపేట: సందీప్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని బీజేపీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. సందీప్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బండారు పెదవెర్రియ్య (చిట్టిబాబు) ఆధ్వర్యంలో స్థానిక వెంకట సందీప్ ఐ క్లినిక్ వద్ద ఆదివారం అపోలో హాస్పిటల్ వారి సౌజన్యంతో రాయితీపై మెగా హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్సీ వీర్రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో అనేక రుగ్మతలు, సమస్యలు పరిష్కరించడంలో సేవా సంస్థల పాత్ర ప్రధానమైందన్నారు. తన తనయుడు దివంగత వైద్య విద్యార్థి సందీప్ స్మృతిలో సేవా కార్యక్రమాలు చేస్తున్న చిట్టిబాబు దంపతులు ధన్యులని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ వీర్రాజును చిట్టిబాబు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎ వేమా, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, రాష్ట్ర పార్టీ నాయకుడు తమలంపూడి రామకృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు, రాష్ట్ర యువమోర్చా కారదర్శి జేపీ, పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతోనే మలేరియా నివారణ

మామిడికుదురు: దోమల నిర్మూలతోనే మలేరియా నివారణ సాధ్యమవుతుందని సీహెచ్ఓ సత్యవతి తెలిపారు. మలేరియా నివారణా మాసోత్సవంలో భాగంగా ఆదివారం నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. «మలేరియా అంతం మనతోనే» అనే నినాదంతో ఈ ర్యాలీ నిర్వహించారు. దోమల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. తద్వారా మలేరియా నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ ఏడుకొండలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోనసీమలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలి

కొత్తపేట: కోనసీమలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర కొబ్బరి దింపు, ఒలుపు కార్మిక సంక్షేమ సంఘం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. ఆ మేరకు సంఘం అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు కోనసీమలో చట్టసభల ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. ఆ నకళ్లను ఆదివారం కొత్తపేటలో విలేకరులకు విడుదల చేశారు. కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయడం ద్వారా కొబ్బరి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని, 50 ఏళ్ల దాటిన కార్మికులకు పింఛన్ మంజూరు చేయాలని, ప్రమాద బీమా పాలసీలు ఏర్పాటు చేయాలని కోరారు.

బాలబాలికలకు బహుమతులు



చిత్రలేఖనంలో ప్రతిభ చూపిన విద్యార్థులు

అయినవిల్లి: చిత్రలేఖనంలో ఉత్తమ ప్రతిభ చూపిన 30 మంది బాల బాలికలకు ఆదివారం ధ్రువపత్రాలు, బహుమతులు అందించారు. వ్యక్తిత్వ వికాసంలో భాగంగా నేదునూరు రావి ఫౌండేషన్ వద్ద గత నెల 15వ తేదీ నుంచి 50 మంది బాల, బాలికలకు చిత్రలేఖనం తరగతులు నిర్వహించారు. టీటీడీ సంప్రదాయ కళల విభాగానికి చెందిన కళాకారులు చింతా సోమశేఖర్ ఆధ్వర్యంలో ఈ తరగతులు జరిగాయి. రావి ఫౌండేషన్‌లో వ్యక్తిత్వ వికాస శిక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ఆటలు, పాటలు, చిత్రలేఖనం వల్ల పిల్లలు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ బొమ్మలు గీయడం, ఆరు బయట ఆడుకోవడం, కథలు వినడం లాంటివి చేస్తున్నారని పేరెంట్స్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రధానంగా చిత్రలేఖనం తరగతులు ప్రారంభమైన నాటి నుంచి ఈ వేసవి సెలవులను బొమ్మలు గీయడంతో గడుపుతున్నారన్నారు. ప్రముఖ చిత్రకారులు కోట బాలకృష్ణ, రావి ఫౌండేషన్ సెక్రటరీ పాలగుమ్మి వెంకటకృష్ణ, సభ్యులు మంద వీరభద్రం, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, అంగర శివసాయిగౌడ్, మంద దుర్గారావు, విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

4న వెన్నుపోటు దినం



పి.గన్నవరంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను విడుదల చేస్తున్న కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు

పోస్టర్ ఆవిష్కరించిన కోఆర్డినేటర్ గన్నవరపు

పి.గన్నవరం: ఎన్నికల్లో ప్రజలకు ఎన్నో హామీలిచ్చి వాటిని గాలికి వదిలేస్తూ చంద్రబాబునాయుడు చేసిన మోసాలు, అరాచకాలపై వైఎస్సార్ సీపీ ఈనెల 4న చేపట్టనున్న «వెన్నుపోటు దినం» నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆపార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పి.గన్నవరంలో దేశిరాజు సీతారామయ్య లేఅవుట్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమానికి నాలుగు మండలాల నుంచి ఉదయం 9 గంటల కల్లా పి.గన్నవరం అక్విడెక్టు వద్దకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు చేరుకోవాలని సూచించారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తామని ఆయన వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసగించిందన్నారు. దీనికి నిరసనగా పార్టీ అధిష్టానం ఆదేశాలతో ఈకార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి ఏడాది తిరగకుండానే 90 శాతం హామీలను అమలు చేసారని గన్నవరపు గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, మందపాటి కిరణ్‌కుమార్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీలు కశిరెడ్డి అంజిబాబు, బూడిద వరలక్ష్మి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్ మాట్లాడుతూ తన పాలనలో దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజా సంక్షేమ పాలన అందించిన జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా చేసేందుకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని అన్నారు. వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల శాఖ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, కుడుపూడి విద్యాసాగర్, విత్తనాల ఇంద్రశేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థిక సాయం



మోరిలో ఆర్థిక సాయం అందిస్తున్న గోవింద్



లక్ష్మి బంధువులకు సాయం అందిస్తున్న అభిమానులు



చింతలపల్లిలో బాధితులకు సాయం అందిస్తున్న పురుషోత్తం తదితరులు

మలికిపురం: ఇటీవల మృతి చెందిన మోటార్ సైకిల్ మెకానిక్ కుటుంబానికి తోటి మెకానిక్‌లు ఆర్థిక సాయం అందించారు. మోరి గ్రామానికి చెందిన పోతురాజు లక్ష్మీ నరసింహ అకాల మృతి చెందడంతో మలికిపురం, సఖినేటిపల్లి మండలాల మెకానిక్‌లు సమకూర్చిన రూ.25 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం నరసింహ భార్యకు అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బొక్కా గోవింద్, గిడుగు భగవాన్, సాలెంద్ర కేశవ రామారావు, కడలి శ్రీనివాస్, కూర్మా దుర్గా ప్రసాద్, యెనుముల రాజు, చిక్కాల సంజీవరావు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి..

మండలంలోని కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఆదుర్తి లక్ష్మికి కృష్ణ-మహేశ్‌బాబు ఫాన్స్ ఆర్థికసాయం అందించారు. ఘట్టమనేని కృష్ణ పుట్టినరోజు సందర్భంగా లక్కవరం థియేటర్ ప్రాంగణంలో కేక్ కట్ చేసిన అభిమానులు.. అనంతరం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. టౌన్ వైడ్ అధ్యక్షుడు గోగన్నమఠం శ్రీనివాసరావు అధ్యక్షతన థియేటర్ యజమాని మంగెన నాని, నేతల శ్రీను, జానీ, నాని అభిమానులు పాల్గొన్నారు.

క్షతగాత్రునికి..

ఆపదలో ఉన్న నిరుపేదలకు ఆర్థిక సహాయం చేసి ఆదుకునే గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ రాజోలు మండలం చింతలపల్లిలో రోడ్డు ప్రమాదానికి గురై కాళ్లు చేతులు తీవ్ర గాయాలు కావడంతో విరిగిన కాలు ఆపరేషన్ నిమిత్తం వీరవల్లి లక్ష్మీనారాయణకు రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు కట్టా భాస్కర్ ఆదివారం తెలిపారు. రాజోలు మాజీ ఏఎంసీ అనచూరి రాం పురుషోత్తం, కాంగ్రేగుల రాము బొక్క పృద్వి, గుబ్బల శ్రీను, దొంగ మహేష్, బైరిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు. సంస్థ సేవలను అభినందించారు.

సన్‌డే

● ఠారెత్తిస్తున్న రోహిణి కార్తె
● 41 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు



కె.పెదపూడిలో నిర్మానుష్యంగా రహదారి

అంబాజీపేట: రోహిణీ కార్తె ప్రతాపంతో వేసవి ఉష్ణోగ్రతలు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. ప్రస్తుతం 40 డిగ్రీల నుంచి 41 డిగ్రీలు నమోదవుతూ తీవ్ర ఉక్కపోత, వేడిగాలులు వీస్తూ ఉండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవతున్నారు. ఎండ తీవ్రత, తీవ్ర వడగాలులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయాన్నుంచే సూరీడు తన ఉగ్రరూపం దాల్చడంతో పొయ్యిలో కూర్చున్నట్లు ఉందని ప్రజలు వాపోతున్నారు. గత పది రోజులుగా వాయుగుండం కారణంగా మేఘావృతమై ఉండటంతో ఉక్కబోత మాత్రమే ఉండేది. కానీ ఆదివారం ఒక్కసారిగా భానుడు తన ప్రతాపాన్ని ఉగ్రరూపం చూపించాడు. దాంతో ఎండ తాకిడి, వేడిగాలులకు ప్రజలు బయటకు రావడానికే హడలిపోయారు. ఎండ వేడిమికి తాళలేక ప్రాణాలు పోతున్నాయంటూ వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతూ వచ్చింది. దీంతో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యమయ్యాయి. బస్సులు, లారీల డ్రైవర్లు నానా ఇబ్బందులు పడ్డారు. ముఖానికి జేబు రుమాళ్లు, తడిగుడ్డలు కట్టుకొని ఎండ తీవ్రత తగలకుండా ప్రయత్నాలు చేశారు. మధ్యాహ్నం 12 గంటలయ్యే సరికి పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. సెంటర్‌లోని దుకాణాలన్నీ మూసివేశారు. రాబోయే రెండు, మూడు రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరిగి 42 డిగ్రీలకు పైబడి నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ సైతం హెచ్చరిస్తోంది. నివాస గృహాలు, కార్యాలయాలు, వ్యాపార సముదాయాల్లో నిత్యం ఏసీలు, కూలర్లు, పనిచేస్తూనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగాలకు వెళ్లేవారు, వ్యాపారులు, వ్యక్తిగత పనులపై ప్రయాణాలు చేసే వారు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



పి.గన్నవరంలో 1995-96 టెన్త్ విద్యార్థులు

పి.గన్నవరం: స్థానిక శింగంశెట్టి ప్రభావతి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. ఈ పాఠశాలలో చదువుకుని దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 1995-96 పదో తరగతి విద్యార్థులు ఇక్కడికి రావడంతో సందడి వాతావరణం చోటుచేసుకుంది. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరితో ఒకరు సెల్ఫీలు తీసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఘనంగా సత్కరించారు. తమతో పదో తరగతి చదువుకుని మరణించిన ఏడుగురు విద్యార్థుల చిత్రపటాలకు పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. పాఠశాల పూర్వ విద్యార్థిని, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి మాట్లాడుతూ 1995-96 బ్యాచ్ విద్యార్థులు రాబోయే రోజుల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో, ఆపదలో తోటి విద్యార్థులకు సహాయపడాలన్నారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పనసలో పోషక విలువలు ఎన్నో..



అంబాజీపేటలో విక్రయానికి ఉంచిన పనసకాయలు

అంబాజీపేట: వృక్ష శాస్త్రంలో పువ్వు నుంచి పిందె, పిందె నుంచి కాయ, పండు పుట్టుకొస్తూ ఉంటాయి. కాని పనసపండు పట్టిక మాత్రం అలా జరగదు. ఈ చెట్టు మొదలు నుంచి చివరివరకూ ఎక్కడ నుండైనా కాండం నుంచే పిందె పుట్టుకొచ్చి కాయలు, పండ్లు తయారవుతాయి. అందువల్లనే పనస చెట్టు నిండా కాయలు నిండి ఉంటాయి. అరమగ్గిన పనసపండు తినడానికే జీవించి ఉండాలనే నానుడి ఈ సీజన్‌లో నిజం చేస్తూ ఉంటుంది. సువాసనలు వెదజల్లుతూ నోరూరించే పనసపండు అంటే అందరికీ ఇష్టమే. సృష్టికి ప్రతిసృష్టి చేసిన విశ్వామిత్రుడు అనాసకు ప్రతిగా పనసను సృషించాడంటారు. పనసపండులో శరీరాగ్యోన్ని పెంపొందింపచేసే పలు పోషక పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పండును ఆంగ్లంలో జాక్‌ఫ్రూట్ అంటారు. దీని వృక్ష శాస్త్ర నామధేయం ఎర్టోకార్పస్ ఇంటి గ్రిఫోలియా. మార్చి నుంచి జూలై వరకూ పనస చెట్టుకు బరువైన కాయలు వేలాడుతూ కనిపిస్తాయి. ఒక్కో చెట్టుకు 100 వరకూ కాయలు దిగుబడిగా వస్తాయి. ఒక్కో కాయ పది నుంచి ఇరవై కేజీల బరువు ఉంటుంది. అయితే ఈ కాయలు ఎంత బరువున్నా అందులో 30 శాతం మాత్రమే తినడానికి ఉపయోగపడుతుంది.

రకాలు..

బంగారు పనస, కొబ్బరి పనస, ఖర్జూర పనస, వేరు పనస, చిన్నకోల పనస, గుంద్రు పనస, గులాబీ పనస, కర్ణపనస, తేనె పనస అనే రకాలు ఉన్నాయి. వివాహాది శుభ కార్యాలయాలకు అందిరినీ ప్రీతిపాత్రమైన పనస కాయ కూరకు ప్రాధాన్యం ఇస్తారు. ఈ పనసకాయను పొట్టుగా కొట్టి వంటలకు ఉపయోగిస్తారు. అంతేకాకుండా లేత పనస కాయను చిన్న ముక్కలుగా తరిగి మసాల కూరలుగా ఉపయోగిస్తారు.

పోషకాలు..

పనస కాయలో ఉండే పోషకాలు చాలా విలువైనవని సీజన్‌లో దొరికే పండ్లను కచ్చితంగా తినాలని వైద్యులు పేర్కొంటున్నారు. మాంసకృత్తులు 1.9 శాతం, చక్కెర పదార్థం 19.8 శాతం, కొవ్వులు 0.1 శాతం, కెరోటిన్ 175 మైక్రో గ్రాములు, థియోమిన్ 0.3 మిల్లీ గ్రాములు, విటమిన్ సి 7 మిల్లీ గ్రాములు, పీచు పదార్థాలు 1.1 శాతం, సున్నం 20.0 మిల్లీ గ్రాములు, ఇనుము 0.56 మిల్లీ గ్రాములు లభిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

అంబాజీపేట పనసంటే మక్కువ



తింటే గారెలు తినాలి... లేదా అంబాజీపేట పనస తినాలి అనే నానుడు పూర్వం నుంచి ఆచరణలో ఉంది. మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల వారు అంబాజీపేట పనస పండంటే ఎంతో మక్కువని పూర్వీకులు చెబుతారు. పనసలో ఉండే రకాలన్నీ అంబాజీపేట చుట్టు పక్కల ప్రాంతాల్లోనే లభిస్తాయి. అంతేకాకుండా పనస పంటపై రైతులు ప్రత్యేకశ్రద్ధ తీసుకుని వాటిని సంరక్షిస్తుంటారు.

– గంటి ప్రభు, అంబాజీపేట